ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 4 సెప్టెంబరు 2025

రాజన్న ఆలయంలో మహాగణపతికి మూలమంత్ర హవనం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని ప్రతిష్ఠించిన గణపతికి బుధవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 9గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనం ఘనంగా చేపట్టారు. సాయంత్రం 7.15 గంటలకు శ్రీలక్ష్మీగణపతి స్వామివారికి మహాపూజను నిర్వహించారు. కాగా, శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాజమండ్రి ఇస్కాన్ ఆలయ చైర్మన్ సత్యగోపినాథ్‌దాస్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి బుధవారం ఉదయం వచ్చిన ఆయన స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటుండెంట్ శ్రీనివాస్‌శర్మ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. రాజన్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ బోడుసు మహేష్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలనే లక్ష్యంతో అన్ని గ్రామాలలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి, రహీంఖాన్‌పేట గ్రామాల్లో పల్లె దవాఖానలను జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి రామకృష్ణతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు వ్యాక్సిన్ చేసిన తర్వాత రెండు గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

- బీఆర్ఎస్‌లో కలిసిపోయిన 'జాగృతి' శ్రేణుల్లో సందిగ్ధం
- జిల్లాలో ఇప్పటికీ కవితతో సత్సంబంధాలు
- 2008లోనే సిరిసిల్ల నుంచి జాగృతి పయనం
- తాజా పరిణామాలతో సిరిసిల్ల నియోజకవర్గంలో ఉత్కంఠ

వెంట నడిచేదెవరో..!



సిరిసిల్లలో నేత కుటుంబాల మహిళల సమస్యలు తెలుసుకుంటున్న కవిత(ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బీఆర్ఎస్‌లో నెలకొన్న తాజా పరిస్థితులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో విభిన్నమైన చర్చలకు దారితీశాయి. బీఆర్ఎస్ నుంచి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను బీఆర్ఎస్ నుంచి తొలగించడం.. బుధవారం ఆమె పార్టీకి రాజీనామా చేయడమే కాకుండా పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీపదవిని కూడా వదులుకుంటున్నట్లు ప్రకటించారు. గులాబీలో ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో కలిసి పనిచేస్తున్న జాగృతి శ్రేణులు అయోమయంలో పడ్డారు.

జాగృతి తొలి అడుగు సిరిసిల్ల నుంచి..

తెలంగాణ జాగృతి సంస్థ తొలి అడుగులు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మొదలైనట్లు చెప్పుకుంటున్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 2009లో అప్పుడు టీఆర్ఎస్ అభ్యర్థిగా కే తారకరామారావు బరిలోకి రాకముందే 2008 సంవత్సరంలోనే జాగృతి పేరుతో కవిత పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పలు మండలాల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను స్థాపించారు. పలు కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి ఉద్యోగఅవకాశాలు కల్పించే ప్రయత్నాలు చేశారు. ప్రజా ఉద్యమాలకు మద్దతునిచ్చారు. సిరిసిల్లలో నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న క్రమంలో వారి కుటుంబాల్లోని మహిళకు కుట్టు శిక్షణ అందించడానికి పరిశీలన చేశారు. ప్రస్తుతం ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు వద్ద అనంతగిరి గుట్టలపైన పశ్చిమ చాళుక్యుల నాటి కోట చరిత్రను ప్రజల ముందుకు తీసుకురావడం విశేషం. కవిత కార్యక్రమాలకు వారి బంధువులు మద్దతునిచ్చారు. జాగృతిలోగో సిరిసిల్లలో రూపుదిద్దుకొంది. జాగృతి వైపు యువత ప్రధానంగా ఆకర్షితులవుతూ వస్తున్న క్రమంలోనే 2009లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కేటీఆర్ గెలుపొందిన తర్వాత కవిత తన కార్యక్రమాలను తగ్గించారు. జాగృతితో కలిసి పనిచేసిన వారు బీఆర్ఎస్ పార్టీలోకి మారిపోయారు. కొంతమంది జాగృతి ప్రతినిధులుగా గులాబీ పార్టీలో పనిచేశారు. ప్రస్తుతం గులాబీ పార్టీలో ఉన్న జాగృతి అభిమానులు సందిగ్ధంలో పడిపోయారు.

● కవిత వైపు బీఆర్ఎస్ అసంతృప్తి నేతల చూపు..

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా మోస్తూ సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారిలో అసంతృప్తి వీడడం లేదు. కాంగ్రెస్, బీజేపీల నుంచి వలస వచ్చిన వారు తిరిగి కొందరు సొంతగూటికి వెళ్లిపోయారు. పార్టీలో ఉన్న వలసదారులకు ప్రాధాన్యం ఉండడంతో తొలినాళ్ల నుంచి పనిచేస్తున్న ఆదరణకు నోచుకోని వారు...

- మిగతా 8లో

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న తండావాసులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి) : నాలుగు తండాలను కలిపి కేలోతుతండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయాలని కోరుతూ లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోని వీర్నపల్లి మండలం కేలోతు తండా, శంకర్‌నాయక్‌తండా, రెడ్డితండా, అజ్మీరాతండా వాసులు బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యానాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్‌రాథోడ్, తండాల పెద్దలు జగన్‌నాయక్, నరహరినాయక్, రాజంనాయక్, గంగ్యానాయక్, లింబనాయక్, గంగాధర్, రాజేశ్, స్వామి, తిరుపతి, మహిపాల్, రవీందర్‌నాయక్, సుధాకర్, ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

అన్ని రంగాల్లో రుద్రంగి అభివృద్ధి..



భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో రూ.20లక్షలతో మూడు బతుకమ్మ తెప్పల నిర్మాణం కోసం బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోరిక మేరకు బతుకమ్మ తెప్పల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, అభిలాష్, లింగం, మహేష్, యాదయ్య, రాజలింగం, శ్రీనివాస్, అశోక్, మల్లయ్య పాల్గొన్నారు.

క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

- తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ మైనార్టీ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం పాస్టర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. క్రైస్తవ బరియల్ గ్రౌండ్స్ అభివృద్ధి, భూకేటాయింపు, చర్చిల నిర్మాణ అనుమతులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, క్రైస్తవ మైనార్టీలకు కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ, పీఎం15 పాయింట్ ప్రోగ్రాంలపై చర్చించారు. ఈసందర్భంగా చైర్మన్ దీపక్‌జాన్ మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించడం హర్షనీయమన్నారు. క్రైస్తవుల ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమస్యలు ఉంటే సోమవారం జరిగే ప్రజావాణిలో కార్యక్రమంలో కలెక్టర్‌కు అందించాలన్నారు. ప్రాధాన్యత అంశంగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 571 అనుసరించి అవకాశం మేరకు భూ కేటాయింపులు చేస్తామన్నారు. భూసమస్యలుంటే లింకు డాక్యుమెంట్స్‌లను సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు పాస్టర్‌లు మాట్లాడుతూ సన్మాన వాటిక, కమ్యూనిటీహాల్స్, చర్చిల నిర్మాణాలకు స్థలాలను కేటాయించాలని కోరారు. వేములవాడ ఆర్డీవో రాధాబాయ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఏంఏ భారతి, అధికారులు పాల్గొన్నారు.

రేపు జీపీవోలకు నియామక పత్రాలు జారీ

- వీడియోకాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ లోకేష్‌కుమర్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల పరీక్షలు రాసి ఉత్తీర్ణతను సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందిస్తారని సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ వెల్లడించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా జీపీవోలను నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పరీక్షలను నిర్వహించిందన్నారు. ఇందులో భాగంగా ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 5వ తేదీన మంత్రులతో కలిసి సీఎం నియామక పత్రాలను అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సమాచారం అందించాలన్నారు. వారిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జిల్లా నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి నిర్ణీత సమయానికి వచ్చేలా తరలించాలన్నారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలకు ఇవ్వాలన్నారు.

తగిన ఏర్పాట్లు చేయాలి

జిల్లా నుంచి జీపీవో పరీక్షలు రాసి 66మంది ఉత్తీర్ణత సాధించారని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా వెల్లడించారు. అభ్యర్థులను ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌ను నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. హైదరాబాద్ తరలివెళ్లే అభ్యర్థులకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుదిరిన ఒప్పందం.. టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె విరమణ



చర్చలు జరుపుతున్న చేనేత జౌళి శాఖ అధికారులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూలి పెంపు ఒప్పందంతో టెక్స్‌టైల్ పార్కు కార్మికులు చేస్తున్న సమ్మె విరమించారు. బుధవారం మండలంలోని బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో చేనేత జౌళి శాఖ ఏడీ కార్మికుల డిమాండ్లపై యజమానులు, కార్మికసంఘ నాయకులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ వస్త్రానికి ప్రస్తుతం ఇస్తున్న కూలి గిట్టుబాటు అవ్వడంలేదని మీటరుకు రూ.1 పెంచాలని చర్చలో కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. యజమానులు 50 పైసలు మాత్రమే చెల్లిస్తామని తేల్చి చెప్పారు. దీంతో కార్మిక సంఘం నాయకులు చర్చల నుంచి నిష్క్రమించారు. చేనేత జౌళి శాఖ కమిషనర్, జాయింట్ డైరెక్టర్‌లు కార్మిక సంఘ నాయకులతో ఫోన్ ద్వారా చర్చించి ప్రభుత్వ వస్త్రానికి 65పైసలు పెంచే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని. అలాగే వారం రోజుల్లోపు టెక్స్‌టైల్ పార్కు కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. సమావేశంలో త్రిఫ్ట్, 10శాతం యారన్ సబ్సిడీ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తామని సమ్మె విరమించాలని కోరారు. అలాగే ప్రైవేట్ వస్త్రానికి నెలరోజుల్లోపు కూలి పెంచి ఒప్పందం జరిపించేలా చర్యలు తీసుకుంటామని సమ్మె విరమించాలని చేనేత జౌళి శాఖ ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ వస్త్రానికి మీటరుకు 65పైసలు చెల్లిస్తామని యజమానులు, అధికారులు ప్రకటించడంతో సమ్మె విరమించారు. చేనేత జౌళిశాఖ ఏడీ రాఘవులు, యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్, పవర్‌లైం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ,పార్క్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, శ్రీరాముల రమేష్ చంద్ర, సంపత్, శ్రీకాంత్, అంజనేయులు, శ్రీనివాస్, అంబదాస్, రమేష్, నర్సయ్య, చేనేతజౌళి శాఖ అధికారులు, యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా 'సంకల్ప్' అవగాహన కార్యక్రమాలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'సంకల్ప్' అవగాహన కార్యక్రమాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మహిళా అభ్యున్నతిపై 'సంకల్ప్' పేరిటి పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ఎస్పీ మహేష్‌బీగీతేతో కలిసి సంబంధిత అధికారుతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2 నుంచి 12వ తేదీవరకు పది రోజుల పాటు సంకల్ప్ హెచ్ ఈడబ్ల్యూపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సిరిసిల్ల జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీయాక్ట్, మహిళల సంరక్షణ కోసం ఉన్న చట్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం రూపొందించిన పథకాలు, కార్యక్రమాలు ఇందిరా మహిళాశక్తి, అందుతున్న వివిధ ఉపాధి అవకాశాలపై ఐదు వందల మంది మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచరులకు సంపూర్ణ అవగాహన కల్పించి ఆడపిల్లలను మగపిల్లలను సమానంగా చూడాలని ఉచితంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు, డిగ్రీ, నర్సింగ్, మెడికల్, వ్యవసాయ కళాశాలలో ప్రభుత్వం సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో జెండర్ సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ కిషోర స్వస్థ క్షేత్రం సందర్శించాలని, శానిటరీ పాడ్ వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంపై అవగాహన కల్పించాలన్నారు. పనిచేసే ప్రదేశాలల్లో మహిళల సేఫ్టీ కోసం ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించాలని షీ టీంల బృందాల గురించి చర్చించాలన్నారు. ప్రతి కార్యాలయంలో మహిళల వేధింపుల గురించి చర్చించేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు లీగల్ క్లినిక్‌ను ఏర్పాటుచేయాలన్నారు. ఉన్నత చదువులు, నైపుణ్య శిక్షణ పొందుతున్న మహిళలతో సెల్ఫీ తీసుకుంటూ సామాజిక సమాజంలో మహిళ అభివృద్ధి గురించి ప్రచారం చేయాలన్నారు. పోస్కో యాక్ట్ గురించి అందిరికి తెలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో వినోద్‌కుమార్, డీపీవో షరీఫుద్దీన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, సఖి సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు వేములవాడలో గణేష్ నిమజ్జనం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని గురువారం గణేష్ నిమజ్జనం చేసేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. గుడి చెరువులో ఆటంకాలు లేకుండా నిమజ్జన వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బీ గితే నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో కమిషనర్ అన్వేష్ రూ.11లక్షల అంచనా వ్యయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నిమజ్జనం చేసేందుకు 5 క్రేన్‌లను, 10 మంది గజీతగాళ్లను సిద్ధం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన బీజేపి నేత

వేములవాడ గుడి చెరువులో గురువారం నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతవరణంలో నిర్వహించుకోవాలని, గుడి చెరువులో నిమజ్జనం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. నిమజ్జనం కోసం వచ్చే గణేష్ విగ్రహాలను నిమిజ్జనం చేసేందుకు ఆలస్యం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'కీర్తి కిరీటం' పురస్కార ప్రదానం



పురస్కారం అందుకుంటున్న పాతూరి మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాతూరి మహేందర్‌రెడ్డి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి కిరీటం పురస్కారం అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎన్టీఆర్ కళా మందిరంలో జరిగిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కీర్తి కిరీటం పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో పాతూరి మహేందర్‌రెడ్డి ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. పురస్కార ప్రదానోత్సవంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ చైర్మన్ బుర్ర వెంకటేశం, సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ నిత్యానందరావు చేతుల మీదుగా పాతూరి మహేందర్‌రెడ్డి కీర్తి కిరీటం పురస్కారం అందుకున్నారు.

పంట నష్టం పరిశీలన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, బండలింగంపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో పంట నష్టపోయిందని అంచనా వేశామని ఏఈవోలు శ్రీశైలం, అనూషలు పేర్కొన్నారు. పలు గ్రామాల్లోనూ పంటలను పరిశీలించి అంచనా వేయాలని ఏవో రాజశేఖర్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య కోరారు. నాయకులు గౌస్, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలచందర్, రాజు, రైతులు ఉన్నారు.

పోలీస్ కార్యాలయంలోని విఘ్నేశ్వరుడి నిమజ్జనం

- ఎస్పీ మహేష్ బి. గీతే దంపతుల పూజలు



పూజలు చేస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో కొలువుదీరిన గణనాథుడికి ఏడురోజులుగా పూజలు చేసి బుధవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే దంపతులు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం తీర్థప్రసాదాలు తీసుకొని డప్పువాయిద్యాలతో మహిళలు, పిల్లలు, పోలీసు అధికారుల కోలాటలు, ఆట, పాటల మధ్య ఆనందోత్సాహాలతో నృత్యాలుచేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సకాలంలో పూర్తయ్యేట్లు చూడాలన్నారు. మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం రోజున పోలీస్‌శాఖకు సహకరించి ఆటంకాలు లేకుండా నిమజ్జన శోభాయాత్రను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదానాలు
8
యూరియా కోసం రైతుల పడిగాపులు

జాతీయ స్థాయిలో సత్తాచాటిన సిరిసిల్ల విద్యార్థులు

కిక్ బాక్సింగ్‌లో రాష్ట్రానికి రజత, కాంస్య పతకాలు..


రజిత పతకం అందుకున్న శ్వేదిక

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. తెలంగాణ రాష్ట్రానికి రజతం, కాంస్య పతకాలను తీసుకొచ్చారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఐదు రోజుల పాటు జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్నారు. కిక్ బాక్సింగ్ క్రియేటివ్ ఫామ్ వెపన్ ఓల్డర్ కెడేట్ బాలికల విభాగంలో గజ్జెల శ్వేదిక ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. యంగర్ కెడేట్ బాలుర విభాగంలో పాయింట్ ఫైట్, లైట్ కాంటాక్ట్ ఫైట్ ఈవెంట్లో గౌతమ్ ఆనంద్ తృతీయ స్థానంలో నిలిచి రెండు కాంస్య పతకాలను సాధించాడు. ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసి యేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి మహిపాల్, కోశాధికారి పన్నీరు శ్రీనివాస్ విద్యార్థులు శ్వేదిక కు రజత పతకం, గౌతమ్ ఆనంద్‌కు రెండు కాంస్య పతకా లను అందించి అభినందించారు.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోచ్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పతకాలను సాధించి జిల్లాకు విద్యార్థులు శ్వేదిక, ఆనంద్ ఖ్యాతిని తీసుకొచ్చారని అన్నారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో బంగారు పతకాలను



కాంస్య పతకాలను అందుకున్న గౌతమ్ ఆనంద్

సాధించిన వారు అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని, కొద్దిలో జిల్లా విద్యార్థులు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోలేక పోయారన్నారు. మరో ప్రయత్నంలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి ఇప్పటి నుంచి మరింత సాధన అవసరం అని అన్నారు.



సింగసముద్రం.. జల సోయగం..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలానికి ప్రధాన సాగు నీటి వనరైన సింగసముద్రం చెరువు జలసోయగంతో కనువిందు చేస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి సాగు నీటి వనరులోకి వరద నీరు వచ్చి చేరుతుండడం వల్ల మత్తడి పరవళ్లు తొక్కుతోంది. పర్యాటకులు జల దృశ్యాన్ని తిలకించేందుకు చెరువు వద్దకు చేరుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. దూరం నుంచే సింగసముద్రం చెరువు అందాలను తిలకిస్తున్నారు. - ఎల్లారెడ్డిపేట, ఆంధ్రజ్యోతి

పూలతో పరిమళించిన పల్లె..

బహుజన బతుకమ్మ పాట చిత్రీకరణ


గోపారావుపల్లెలో బహుజన బతుకమ్మ షూటింగ్

సిరిసిల్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఆటపాటతో పూలతో ముందే ఆ పల్లె పరమలించింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం బహుజన బతుకమ్మ పాట చిత్రీకరణ జరిగింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెలో పాట షూటింగ్ చేశారు. బతుకమ్మలు పేర్చి ఆటా పాటలతో ఎంతో సంబరంగా జరిగిన షూటింగ్‌ను గ్రామస్థులు తరలి వచ్చి తిలకించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో పాటు అనిత, రాకేష్‌లు పాటను గానం చేశారు. పాటను మిత్ర రచించారు. చిత్రీకరణకు దర్శకుడిగా గాయకుడు వంతడుపుల నాగరాజు, కెమెరామన్ కమ్లిపటేల్, ఒగ్గు కళాకారులు, డప్పు కళాకారులు, కోలాట బృందంతో పాటు కళాకారులు బుల్లెట్ వెంకన్న, శ్రీనివాస్ తదితరులు చిత్రీకరణలో ఉన్నారు.

జమ్మికుంటలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌పై హర్షం

భగత్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో దక్షిణ్, రాయపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపేందుకు అధికారులు నిర్ణయించడంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ (దక్షిణ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నంబరు 12721), హజ్రత్ నిజాముద్దీన్ నుంచి హైదరాబాద్ (రైలు నంబరు 12722), సికింద్రాబాద్ నుంచి రాయపూర్ వరకు (రాయపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నంబరు 12771) రైళ్లు ఇకపై జమ్మికుంటలో ఆగనున్నట్లు తెలిపారు. ఈ మూడు రైళ్లు ఆపేందకు ఒకటి రెండురోజుల్లో దక్షిణ మధ్య రైల్వే నోటిఫికేషన్ జారీ చేస్తుందని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజక వర్గ పరిధిలోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, తన ప్రతిపాదనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న రైల్వే అధికారులు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో మొదటి ర్యాంక్


వెంగల రఘు

శంకరపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వెంగల రఘు (అంధ విద్యార్థి) ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఇప్పలపల్లికి చెందిన రఘు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎంఏ సోషియాలజీ పూర్తి చేశాడు. సెప్టెంబర్ 1 తేదీన వెల్లిడించిన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించాడు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- 2028లో బీజేపీదే అధికారం
- అవినీతిపై గ్రామ స్థాయి నుంచి ఉద్యమం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు


కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, నాయకులు

కరీంనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమ్మేళనంలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం తొలిసారి కరీంనగర్‌కు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్‌లు అన్నింటిలోనూ బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు అందిస్తుందన్నారు. 11 సంవత్సరాల్లో రాష్ట్రానికి 12 లక్షల కోట్లు నిధులు వెచ్చించిందన్నారు. కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం కోసం రెండు వేల కోట్లు కేటాయించిందన్నారు. బండి సంజయ్ కేంద్ర న్యాయశాఖ మంత్రితో మాట్లాడి కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ క్లాసులు ప్రారంభమయ్యేలా చూశారన్నారు.

స్థానిక అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదే

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీగా గెలుపొందిన



వారికి ఐదు లక్షలు, జడ్పీటీసీగా గెలుపొందిన వారికి పది లక్షల రూపాయలు అందిస్తామన్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు సైకిళ్లు అందించామని, బీజేపీని గెలిపిస్తే వచ్చే ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందిస్తామన్నారు. ఒకటి నుంచి ఆరో తరగతి చదివే విద్యార్థులకు మోదీ కిట్స్ అందిస్తామన్నారు. ప్రపంచంలోనే అత్యంత అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రామ చందర్ రావు ఆధ్వర్యంలో గొల్కొండ కోటపై కాషాయ జెండా ఎగురవేయయడం ఖాయమన్నారు. 2028లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిపించి రామచందర్ రావుకు బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, మాజీ మేయర్‌లు డి శంకర్, సునీల్‌రావు పాల్గొన్నారు.


హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అవినీతి పార్టీలను తరిమికొట్టండి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

భగత్‌నగర్: అవినీతి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ లను తరిమికొట్టాలని శాసనమండలి సభ్యుడు చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 20 నెలల పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తల కృషి మరిచిపోలేనని, రానున్న స్థానిక ఎన్నికల్లో తనకు ఏ బాధ్యతలు అప్పగించినా శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెర వేర్చలేదన్నారు.



రేణికుంట టోల్‌గేట్ వద్ద భారీ స్వాగతం

తిమ్మాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై మొదటిసారి కరీంనగర్ జిల్లాకు వచ్చిన రాంచందర్‌రావుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రేణికుంట వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు గజామాల వేశారు. అనంతరం రేణికుంట నుంచి భారీ కన్వాయ్‌తో ర్యాలీగా బయలుదేరి కరీంనగర్ పరిధిలోని అలుగునూర్ కూడలి వరకు తరలివెళ్లారు. అలుగునూర్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. ఇద్దరు కలిసి అలుగునూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, తిప్పర్తి నికేష్, జిల్లా నాయకులు సొల్లు అజయ్‌వర్మ, దండు కొమురయ్య, గుర్రల వెంకట్‌రెడ్డి, కొమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, చింతం శ్రీనివాస్, దుర్శెట్టి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

ఎలిగేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట గ్రామంలో బుధవారం ఊరకుక్కల దాడిలో అల్లి జయఆదిత్య(4) తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం పూట బిస్కెట్ల కోసం షాప్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో కుక్కల మంద అతనిపై దాడి చేసింది. పక్కన ఉన్న వారు తేరుకునే సరికి తీవ్రంగా గాయపరిచాయని గ్రామస్థులు పేర్కొన్నారు. బాలున్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి కుక్కకాటుకు సంబంధించిన వైద్యం అందిస్తున్నామని బాలుడి తండ్రి మనోజ్ పేర్కొన్నారు.

కుక్కలను తప్పించబోయి అధ్యాపకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో కుక్కలను తప్పించబోయిన అదే గ్రామానికి చెందిన అధ్యాపకుడు నీరటి విష్ణుప్రసాద్ బుధవారం తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రుడిని స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని విష్ణుప్రసాద్ తన బైక్‌పై విధులు నిర్వహించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బయలుదేరారు. గ్రామ శివారులో ఒక్కసారిగా కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి కింద పడ్డారు. గ్రామంలో కుక్కల బెడద అధికమైందని, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకుని నివారించాలని ప్రజలు కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


చిన్నయ్య (ఫైల్)

పాలకుర్తి/ఎండపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లి మండలం మారేడుపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లింగాల చిన్నయ్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి 12 గంటల వరకు వెతి కినా ఆచూకీ దొరకలేదు. ఫోన్ రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. బుధవారం ఉదయం అతని కూతుళ్లు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులకు చిక్కిన బైక్ దొంగిలించిన వ్యక్తి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని విజయ్‌నగర్ కాలనీలో కొద్ది రోజుల కిందట బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని బుధవారం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. విజయ్‌నగర్ కాలనీకి చెందిన అబ్దుల్ రహమాన్ తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేసి మరుసటి రోజు ఉదయం చూసే సరికి బైక్ కనిపించలేదు. వెంటనే బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బొమ్మకల్ ఫ్లై ఓవర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రజ్వీచమన్ ప్రాంతానికి చెందిన షేక్ షాదుల్ అనే వ్యక్తి పోలీసులను చూసి బైక్‌తో తప్పించుకునేందుకు యత్నించాడు. గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా బైక్ దొంగతనం చేసినట్లు వెల్లడైంది. ఈ మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిలు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కరీంనగర్‌లోని గౌతమినగర్‌కు చెందిన తమ్మిశెట్టి వరప్రసాద్(26)కు 3 రోజులు సాధారణ జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా, మానకొండూర్‌కు చెందిన దాసరిగొండ రవి(34)కు రెండు రోజుల సాధారణ జైలు, రాంపూర్‌కు చెందిన తోట రాజ్‌కుమార్(53)కు ఒక రోజు సాధారణ జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న డ్రంకెన్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని, మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

1.2కిలోల గంజాయి స్వాధీనం

కోల్‌సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనం సందర్భంగా గోదావరిఖనిలో విక్రయించేందుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్‌హాల్ సమీపంలో పట్టుకున్నట్టు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన ఆటోడ్రైవర్ కోడూరి అభినవ్‌వర్ధన్(26), గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన పెయింటింగ్ వర్కర్ చెరుకు శ్రీనివాస్(29)ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.220కిలోల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. కొత్తగూడెంకు చెందిన అభినవ్ వర్ధన్ సీలేరు ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్, ఇతరప్రాంతాల్లో అమ్మేవాడన్నారు. గోదావరిఖనికి చెందిన శ్రీనివాస్ తనసోదరి ఇంటికి కొత్తగూడెంకు వెళ్లగా అక్కడ అభినవ్‌తో పరిచయడం ఏర్పడిందని, ఇద్దరు గంజాయి సేవించే వారు కావడంతో స్నేహంగా మారి గంజాయి రవాణాకు పథకం వేశారన్నారు.

గోదావరిఖనిలో గణపతి నిమజ్జనం ఉన్నందున చిన్న ప్యాకెట్లుచేసి అమ్మడం వల్ల ఎక్కువ డబ్బులు వస్తాయని శ్రీనివాస్ చెప్పాడని, కిలోకు రూ.15000చొప్పున మాట్లాడుకుని, అడ్వాన్స్‌గా రూ.5వేలు ఇచ్చాడన్నారు. భద్రాచలం అటవీప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చిన అభినవ్ గోదావరిఖనిలో అమ్మేందుకు ప్రయత్నిస్తు న్నాడనే సమాచారంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రమేష్, అనూష, క్రైమ్‌పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు రమేష్, మధుకర్, మధుసూదన్ దాడిచేసి పట్టుకున్నారన్నారు.


అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆదివారంపేటకు చెందిన ఇల్లందుల సన్ని (20) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కరీం నగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని సుభాష్‌నగర్ స్టేజీ వద్ద సన్ని తన ద్విచక్రవాహనంతో యూటర్న్ తీసుకుంటుండగా హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కారు డ్రైవర్ అతివేగంగా నడుపుకుంటూ వచ్చి సన్ని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కోళ్ల పందేల స్థావరంపై దాడి..

ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోళ్ల పందెం స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో కోళ్ల పందెం స్థావరంపై ఎస్ఐ ఉపేంద్రచారి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నిందితుల వద్ద నుంచి రూ.45160లతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు మూడేళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రంకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ తీర్పు ఇచ్చారు. ముస్తాబాద్ ఎస్ఐ గణేశ్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రం తన భార్య కనుకవ్వను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. మద్యం సేవించి గొడవలు పెట్టడంతో డిసెంబరు 2, 2016న భార్యపై దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. భార్య కనుకవ్వ ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడు రామచంద్రంపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అప్పటి ఎస్ఐలు చిట్టిబాబు, ప్రవీణ్‌లు చార్జిషీట్ దాఖలు చేయగా పీపీ సందీప్ వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ దేవెందర్ 12మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పందిళ్లకు చెందిన దబ్బెట రాధ(47) మృతి చెందింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. పందిళ్లకు చెందిన రాధ, ఆమె భర్త మల్లయ్య ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడి పోగా రాధ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని మృతురాలి భర్త మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


రాధ (ఫైల్)

పందిళ్లలో విషాదం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిళ్ల గ్రామానికి చెందిన దబ్బెట రాధ (55) కరీంనగర్‌లో బుధవారం లారీ ప్రమాదంలో మృతిచెందగా పందిళ్ల గ్రామంలో విషాదం అలుముకుంది. రాధ తన భర్త మల్లయ్యతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రిలో వైద్య చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనం పై వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండే రాధ మృతి చెందడంతో విషాదం అలుముకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



రాధ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహూన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.



మన్‌దీప్ సింగ్

జొకో.. జోరు

యూఎస్ ఓపెన్





సబలెంక

సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసోవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తో పాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు
'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్థం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్థంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవాంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లి



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

బిజినెస్

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీ తోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4.23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

వినాయక మండపాల వద్ద

కుంకుమ పూజలు, అన్నదానాలు..


సిరిసిల్ల సర్దార్‌నగర్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


నారాయణపూర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న కృష్ణారెడ్డి తదితరులు


బోయినపల్లిలో మహిళల కుంకుమ పూజ..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బుధవారం పలు వార్డులలో గణపతి నవరాత్రలలో భాగంగా సత్యనారాయణ వ్రతాలు, కుంకుమ పూజలు, అన్నదానాలను నిర్వహించారు. స్థానిక సర్దార్‌నగర్‌లోని శ్రీ గురుకులాశ్రమ సంఘం, విద్యానగర్ శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపాలలో మహిళలు కుంకుమ పూజలను నిర్వహించారు. గాంధీనగర్ యువజన సంఘం వినాయక మండపంలో దంపతులు సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం మండపం నిర్వాహకులు అన్నదానం చేశారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, గుండ్లపెల్లి పూర్ణచందర్, శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బొల్లి రామ్మోహన్, యెల్లారెడ్డి, శేఖర్, వెల్మల తిరుపతిరెడ్డి, ధర్మారెడ్డి, ధర్మారెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం, శంకర్, ప్రసాద్, గురుకులాశ్రమ సంఘం సభ్యులు చిటికెన వెంకటేశం, చిటికెన సత్తయ్య, రాజు, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలతో పాటు నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, పదిర, వెంకటాపూర్, బండలింగంపల్లి, రాచర్లగుండారం, అల్మాస్‌పూర్, కంచర్ల, మద్దిమల్ల, గర్జనపల్లి, వన్‌పల్లి తదితర గ్రామాల్లో కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపాల వద్ద బుధవారం పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. తహసీల్దార్ సుజాత ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్లు సబేరాబేగం, రాములునాయక్, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు ఏకదంతుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

బోయినపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు బుధవారం నిర్వహించుకున్నారు.


ముస్తాబాద్‌లో 108 వంటకాలతో నైవేద్యం..

బోయినపల్లి, రత్నంపేట గ్రామాల్లో మహిళలు కుంకుమ పూజలుచేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని గణేష్ మండపాల వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌ను నిర్వాహకులు సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, ఇప్ప మహేష్, సూరయాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునితో పాటు వివిధ వినాయక మండపాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, కాంగ్రెస్ నాయకులు గొట్టే ప్రభాకర్, ధర్మపురి శ్రీనివాస్, పులి సత్తయ్య, ముస్కు ముకుందరెడ్డి, బాలు, దారం చంద్రం,పులి నరేష్, పోంచెట్టి తిరుపతి పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలో కొలువుదీరిన వినాయకుడి మండపాల్లో నిర్వాహకులు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలకేంద్రంలో వివేకానంద యూత్, బావుసాయిపేట చైతన్య యూత్‌తో పాటు పలు గ్రామాల్లో మండపాల నిర్వాహకులు కుంకుమ పూజలు, అన్నదానం నిర్వహించారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని శివకేశవుల ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ఆర్యవైశ్య సంఘం మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. 108 రకాల పిండివంటకాలతో నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కూర సంతోష్, మాజీ అధ్యక్షుడు భిక్షపతి, సోమరాజు, సత్తయ్య, శ్రీనివాస్, సతీశ్, దినేశ్, లావణ్య, వీరమణి, దుర్గవీణ, భవాని, సంధ్య, వరలక్ష్మీ, హరిత, హిమబిందు, రుచిత, స్రవంతి, గోదావరి, సరళ, రాణి, శ్రీలత,లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.


రుద్రంగిలో పూజలు నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్


చందుర్తిలో అన్నదానం చేస్తున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్


కోనరావుపేటలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

చందుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మామిడి నరేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్మికులతో ఎంపీడీవో ఎల్.రాధకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి వంకుదోతు రాజు, ఉపాధ్యక్షుడు వాసం కిరణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయితీ సిబ్బందికి గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని మండల అధ్యక్షుడు వరుకోలు మల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్‌లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బిగుళ్ళ అశోక్, ప్రధాన కార్యదర్శి కాసర్ల బాబు, కోశాధికారి బత్తుల ఎల్లయ్య, సలహాదార్లు జుట్టు గీత, మచ్చ బాలయ్య, రడం నాగయ్య, పండుగు రమేష్, మచ్చ జ్యోతి, దుబ్బ పద్మలతో పాటు వివిధ గ్రామాల సిబ్బంది పాల్గొన్నరు.

అభిమానికి నూతన వస్త్రాలు అందించిన విప్


నూతన వస్త్రాలు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన అభిమాని ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలను అందజేశారు. నాంపల్లి అనుబంధ గ్రామమైన శాలరామన్నపల్లికి చెందిన కదురు బాలయ్య అనే కూరగాయలు వ్యాపారి తన ద్విక్రవాహనానికి మైక్ కట్టి ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రచారం చేశాడు. ఆ విషయాన్ని గుర్తుంచుకున్న ఆది శ్రీనివాస్ బుధవారం నాంపల్లి అనుబంధ గ్రామమైన శాలరామన్నపల్లికి వెళ్లారు. కాసేపు కదురు బాలయ్య దంపతుల యోగక్షేమాలు అడిగి నూతన వస్త్రాలను అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాగిరి నాగరాజు, సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, బొజ్జ భారతి, చిలివేరి శ్రీనివాస్, కాశ శ్రీనివాస్, నీలం గురువయ్య, శంకర్, బొల్గం సాయిలు తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ హెల్పర్‌పై దాడి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న కరెంటు సమస్యలను పరిష్కరించకుండా మీటరు రీడింగ్ నమోదు చేయడానికి ఎలా వస్తారంటూ అసిస్టెంట్ హెల్పర్ శ్రీహరిపై స్థానికుడు రాజయ్య దాడి చేసిన సంఘటన వీర్నపల్లి మండలం కంచర్లలో బుధవారం చోటుచేసుకుంది. అసిస్టెంట్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి ఇంటింటా మీటర్ రీడింగ్ నమోదు కోసం వెళ్లాడు. తమ కాలనీలతో పాటు వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని శ్రీహరిని స్థానికుడు రాజయ్య అడ్డుకున్నాడు. అంతటితో ఆగని ఆయన కర్రతో దాడికి దిగాడు. అక్కడే ఉన్న పలువురు ఇద్దరిని శాంతింపజేశారు. గాయాలపాలైన శ్రీహరిని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజయ్యపై కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరి అరెస్ట్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కేసుల్లో వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని బంగిరెడ్డి తండాకు చెందిన బానోతు శ్రీనివాస్, అజ్మీరా రాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. సీతారాంనాయక్‌తండాలోని బానోతు శ్రీనివాస్ గత నెల 30న అదే గ్రామానికి చెందిన చంద్రు వ్యవసాయ పొలం వద్ద లేగదూడను కట్టేశాడు. తన పొలం వద్ద ఎందుకు కట్టేశామని చంద్రు అడిగిన పాపానికి ఆగ్రహించిన శ్రీనివాస్ దాడికి దిగాడు. బాధితుడి ఫిర్యాదుతో అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బంగిరెడ్డి తండాలోని వ్యక్తి అజ్మీరా రాజు 2021లో అటవీ శాఖ అధికారుల విధులు అడ్డుకోవడంతో పాటు దాడికి దిగాడు. అటవీ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు అదే యేడాది కేసు నమోదు చేశారు. అతనికి వారెంటు జారీ చేయడం జరిగింది. వేర్వేరు కేసుల్లో శ్రీనివాస్, రాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు.

అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లై అధికారుల కథనం ప్రకారం.. బుధవారం తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ శివారులోని బాలాజి రైస్‌మిల్లు నుంచి 287 క్వింటాళ్ల బాయిల్డ్ రైస్‌ను లారీలో అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టుకు బుధవారం 14900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14000 క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 900 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాగా మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఒక గేట్ ద్వారా 2వేలు, ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.42, నీటి నిలువ సామర్థ్యం 27.888 టీఎంసీలకు 26.067 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.59టీఎంసీల నీరు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నాలుగు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.59టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 12800 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో మేరా యువ భారత్(మై భారత్) ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ కేంద్ర ప్రభుత్వ పథకాలపైన యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గ్రంథాలయం జిల్లా చైర్మన్ సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ జిల్లా యూత్ అధికారి ఎం వెంకట్ రాంబాబు మాట్లాడారు. యువతను ప్రోత్సహిస్తూ ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తూ వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వెంకట్‌రాం బాబు మై భారత్ ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ ఉద్దేశాన్ని మై భారత్ నిర్వహించే వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రకృతి ద్వారా వచ్చేటువంటి వివిధ ఉత్పత్తులను ఏ విధంగా మార్కెటింగ్ చేయాలి ఎక్కడ చేయాలి అనే అంశాలపైన యువతకు వివరించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ రిసోర్స్‌పర్సన్ ఎ సంతోష్‌కుమార్, సైబర్‌క్రైమ్ అధికారి వెంకటరమణ టైం మేనేజ్మెంట్ డిసిప్లిన్, సైబర్ నేరాలు, నేరగాళ్ల గురించి, డిజిటల్ అరెస్టు, హనీ ట్రాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం 60 మంది యువతీయువకులకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పుస్తకాలను ముఖ్యఅతిథులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ వలంటరీ గంగిపల్లి స్వామికుమార్, జిల్లా గ్రంథాలయం పాలకులు బి శంకరయ్య, కే మల్లయ్య, త్రిశూల్ యూత్ అధ్యక్షుడు రాజురావు, యువతియువకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

గంభీరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 94 మంది లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిది పర్శ హన్మండ్లు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, తహసీల్దార్ మారుతి రెడ్డి, పార్టీ కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, బాలయ్య, వెంకటి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు


కోరుట్లపేటలో యూరియా కోసం వేచి ఉన్న రైతులు


చందుర్తిలో బారులుతీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో యూరియా కోసం రైతులు బుధవారం పడిగాపులు కాశారు. ఎరువు వచ్చిందనే సమాచారంతో ఉదయమే కేంద్రం వద్దకు చేరుకుని వరుసలో నిలబడ్డారు. గంటల తరబడి నిరీక్షించారు. ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తాను పంపిణీ చేశారు. యూరియా కోసం పనులు వదులుకుని పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి యూరియాను సరఫరా చేయాలని కోరారు.

● చందుర్తి : చందుర్తి మండల వ్యాప్తంగా యూరియా కోసం రైతులు చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంతో పాటు మర్రిగడ్డ గ్రామంలోని ఆగ్రోస్ కేంద్రాలకు యూరియా వచ్చిందనే సమాచారంతో బుధవారం ఉదయం 6గంటల నుంచి రైతులు చెప్పులను క్యూ లైన్‌లో పెట్టి బారులు తీరారు. చందుర్తి సింగిల్ విండోలో గత ఆగస్టు 12న 370మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంకు కేవలం 210 బస్తాలే రావడంతో రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. ఆగ్రహానికి లోనైన రైతులు బస్తాలు లేనప్పుడు టోకెన్లు ఎందుకు ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. అధికారులకు రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులు కలగజేసుకొని రైతులను వారించారు. మర్రిగడ్డ ఆగ్రోస్ కేంద్రం వద్ద ఉదయం నుంచే బారులుతీరిన రైతులు యూరియా బస్తాల కోసం గంటల తరబడి నిరీక్షించారు. బారులు తీరిన రైతులను చూసి పోలీస్ పహారా నడుమ బస్తాల పంపిణీ చేశారు. గంటల తరబడి క్యూలో బస్తాల కోసం నిరీక్షించిన రైతులు చేసేదేం లేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

అధిక ధరలకు విక్రయం..

రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు రైతులను పిండేస్తున్నారు. బస్తా ధర రూ.266 కాగా, రూ.350నుంచి రూ.400 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే లింకుల పేరిట ఇతర బస్తాలను అంటగడుతూ వారి వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. పంటలు సాగు చేయని కొంత మంది ఆధార్ కార్డుతో టోకెన్లు పొంది యూరియా బస్తాలను తీసుకొని ఇతర రైతులకు రూపాయలు 500కు విక్రయించుకొని డబ్బులు దండుకున్నారు. ఇంత జరుగుతున్న వ్యవసాయ శాఖ అధికారులు వారికే కొమ్ము కాస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెబితే ఇవ్వాల్సిందే అంటూ మాటల గారడీ చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

● ఇల్లంతకుంట : యూరియా బస్తాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లంతకుంట, కందికట్కూర్ గ్రామాల్లోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువుల విక్రయకేంద్రాల వద్ద ఉదయమే రైతలు బారులు తీరారు. యూరియా కోసం రైతులకు టోకెన్లను వ్యవసాయశాఖ అధికారులు జారీచేశారు. టోకెన్లులేని వారు సైతం వరుసలో నిలబడటంతో ఇబ్బదులు ఏర్పడ్డాయి. పోలీసుల సహకారంతో యూరియాను పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో సరిపడ యూరియా అందుబాటులోకి వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు.

వెంట నడిచేదెవరో..!

(5వ పేజీ తరువాయి)

కవిత వైపు చూస్తున్నారని భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికీ కొందరు బీఆర్ఎస్ నాయకులు కవితతో సత్సంబంధాలు ఉండడంతో ఆమెతో ఎవరు నడుస్తారనే అనే చర్చ జరుగుతోంది.

కేటీఆర్ రావడంలో కవిత కీలకమే..

సిరిసిల్ల నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలతో సంబంధాలు పెంచుకుంటున్న క్రమంలో 2009లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కేటీఆర్ రావడంలో కవిత కీలకంగానే వ్యవహరించిందని పలువురు చెప్పుకుంటు న్నారు. 2009ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో టీఆర్ఎస్ నుంచి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న కేకే మహేందర్‌రెడ్డికి టికెట్ వస్తుందని భావించారు. కానీ అనూహ్యంగా కేటీఆర్ అభ్యర్థిగా రావడంలో తన తండ్రి కేసీఆర్‌పై ఒత్తిడి పెంచడానికి సిరిసిల్ల నియో జకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ సన్నిహితులు, బంధువులను ఉపయోగించిన విషయాలను చర్చించుకుంటున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కవితకు సంబంధాలు ఉండడంతో రాబోయే రోజుల్లో పార్టీ పెడితే సిరిసిల్ల నియోజకవర్గంలోనూ గులాబీల్లో కదలిక ఏర్పడే ప్రమాదముందని భావిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

క్రీడాపోటీలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవో కృష్ణహరి ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. పోటాపోటీగా జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మనోహరచారి, హెచ్ఎంలు చంద్రశేఖర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా పరిశీలన

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో అధికారులు ప్రదర్శించిన తుది ఓటరు జాబితాను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. ఓటరు జాబితాలో కొందరు మృతుల పేర్లు ఉన్నాయని గుర్తించారు. ఆ పేర్లను తొలగించాలని కోరారు. రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, కిషన్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, గోపాల్, బాల్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యవర్గం

చందుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల అధ్యక్షులుగా మామిడి నరేష్, ప్రధానకార్యదర్శిగా వంకుడోత్ రాజు,ఉపాధ్యక్షుడిగా వాసం కిరణ్,కార్యవర్గ సభ్యులుగా బింగి లక్ష్మి, మంగలి లచ్చవ్వలను ఎన్నుకున్నారు.

సిమెంట్ కుర్చీల వితరణ

కోనరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు చేయూత ఫౌండేషన్ బానోత్ నరేష్ నాయక్ బాధితులకు బాసటగా సిమెంట్ కుర్చీలు బుధవారం అందించారు. నిత్యం మండల ప్రజలు వారి సమస్యలపై కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమస్యలను తెలియజేస్తూ, ఫిర్యాదులు ఇచ్చే క్రమంలో బాధితులకు కూర్చోవడానికి పోలీస్ స్టేషన్‌లో చేయూత ఫౌండేషన్, లైవ్ రాష్ట్ర ఇన్‌చార్జి నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు నాలుగు సిమెంట్ కుర్చీలను అందజేశారు. ఫిర్యాదుదారులు, బాధితులు చేయూత ఫౌండేషన్ బానోత్ నరేష్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి..

రుద్రంగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, ఇందుకు టీఎల్ఎం ఎంతో ఉపయోగ పడుతుందని తహసీల్దార్ పుష్పలత, మండల విద్యాధికారి రామకృష్ణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)ను ప్రదర్శలను ఏర్పాటు చేశారు. స్థానిక పాఠశాల విద్యార్థులు వాటిని తిలకించారు. ఎంపీడీవో నటరాజ్, ఉపాధ్యాయులు గడప వేణు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను బద్నామ్ చేస్తోంది'

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నామ్ చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజక్టును కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతోనే సీబీఐకి అప్పగింస్తుందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికిని కోల్పోయే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నా తెలంగాణ ప్రజలు వాటిని గుర్తిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయులు వడ్లూరి సాయిసూర్య, కాసర్ల శ్రీనివాస్, యశ్వంత్, అక్రమ్, మహేష్, మున్నా, వేణు, వెంకటేశం, హర్షిత్, రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

చందుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. మండలంలోని మూడపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషక పదార్థాల రికార్డులను పరిశీలించారు. అనంతరం కిచెన్ గార్డెన్‌లో విత్తనాలు నాటారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, పద్మ, పాల్గొన్నారు.

మానేరు వాగులో గల్లంతైన రైతు కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నర్మాల ఎగువ మానేరు వాగులో గల్లంతైన రైతు నాగయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లాఉపాధ్యక్షుడు కోమిరిశెట్టి తిరుపతి, రాఘవుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు బెస్త రాజశేఖర్ తల్లి లక్ష్మీ, జోగుల నవీన్ సోదరుడు ప్రభాకర్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను బుధవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. వెంట ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు సాగర్, విఠల్ నాయక్, భాస్కర్, తిరుపతి, పర్శరాములు, పృథ్వీరాజ్, రాజం, అజయ్, మహిపాల్, లింబయ్య, ఎల్లం తదితరులు ఉన్నారు.

గంభీరావుపేటకు మూడు బోర్లు మంజూరు

గంభీరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో మంచినీటి ఎద్దడి నివారణకు జడ్పీ నిధుల నుంచి రూ.4లక్షల 50వేలతో 3బోర్లు మంజూరయ్యాయి. మండల కేంద్రంలోని సీతారాంబజార్, హన్‌మాన్‌నగర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ బోర్లు మంజూరు కాగ, బుధవారం హన్‌మాన్‌నగర్‌లో వేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, నాయకులు అక్కపల్లి బాలయ్య, బంగ్ల రాజు, ప్రభాకర్, వెంకటి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

సికింద్రాబాద్‌కు బస్సును నడిపించాలి

ముస్తాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుండి మండలంలోని కొండాపూర్ గ్రామం మీదుగా సికింద్రాబాద్‌కు ఆర్టీసి బస్సును వేయాలని సిద్దిపేట ఆర్టీసీ డీఎంకు బుధవారం గ్రామస్థులు మార్వాడి గంగరాజు, తినేటి రాంరెడ్డి, పెద్దూరి శ్రావణ్‌కుమర్, క్యారం రామచంద్రంలు బుధవారం వినతి పత్రాన్ని అందించారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ముస్తాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంబించారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పరకాల రవీందర్, కార్యదర్శులు పాముల స్వామి, కోటగిరి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే..

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై మండలంలోని కేసీఆర్‌నగర్ కాలనీలో గురువారం సర్వే నిర్విహిస్తామని, అందరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలలోని కేసీఆర్‌నగర్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించి సర్వేపై చర్చించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, రమేష్ చంద్ర శ్రీరామల, గోవిందు లక్ష్మణ్, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.